

సోయా పంటను పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనల మేరకే
సోయా కొనుగోళ్లు

» మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ రెడ్డి

పెద్ద కొడప్‌గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంట కింద సాగు చేసిన సోయా పంటను నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో సహకార సంఘం ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సహకార సంఘం ఆవరణలో ఉన్న సోయా పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ సోయా పంట మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం 12 శాతం తేమ కలిగి ఉండాలని, మట్టి పెళ్లలు తక్కువగా ఉండాలని, దీంతో పాటుగానే రంగు మారిన సోయాలు ఉంటే కొనబోమని స్పష్టం చేశారు. మండలంలో గతంలో కురిసిన వర్షాలకు సోయా కొంత మేర నాణ్యత లోపించిందని తెలిపారు. మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం ఎన్‌సీసీఎఫ్ సర్వేయర్ నివేదిక ఆధారంగా సోయాను కాంటా చేస్తామని తెలిపారు. అనంతరం భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని రైతన్నలు పండించిన సోయా పంట అకాల వర్షాలకు దెబ్బతిని రంగు మారడంతో పాటు నాణ్యతగా లేకుండా పోయిందని ఇటువంటి పంటను మార్క్‌ఫెడ్ అధికారులు ఎటువంటి నిబంధన విధించకుండా కొనుగోలు చేయాలని విన్నవించారు. అకాల వర్షాలకు సోయా పంట పంట నాణ్యత లోపించడంతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎన్‌సీసీఎఫ్ సర్వేయర్ మహేష్, మార్క్‌ఫెడ్ సిబ్బంది చందూ, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కుమార్ సింగ్, దేవీసింగ్, మల్లిఖార్జున్, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు భారత కమ్యూనిస్టు పార్టీ
వందేళ్ల ముగింపు ఉత్సవాలు

» భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ధశరథ్

కామారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ కార్యాలయంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి దశరథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ అవిర్భవించి 100 సంవత్సరాలు ముగింపు ఉత్సవాలు ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు కొత్త బస్టాండ్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రెడ్ పశ్య పద్మతో పాటు ముఖ్యనేతలు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ, మండల స్థాయి కార్యకర్తలు తరలిరావాలని కోరారు.



కొత్త పింఛన్‌లు ఎప్పుడో?

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్తగా పింఛన్ మంజూరు చేస్తామని, ఉన్న పింఛన్‌లను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ రెండేళ్లు పూర్తికావస్తున్నా నెరవేరకపోవడంతో లబ్ధిదారులు, అర్హులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్ల కిందట ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలలో వృద్ధాప్య, వితంతు, చేనేత, గీత, దివ్యాంగులు తదితర పింఛన్‌ల కోసం జిల్లా వ్యాప్తంగా 77,158 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇప్పటి వరకు ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేయలేదు.

- పింఛన్‌ల కోసం 77 వేలకు పైగా దరఖాస్తులు
- అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- లబ్ధిదారులకు తప్పని ఎదురు చూపులు
- ప్రస్తుతం జిల్లాలో 1.65 లక్షల ఆసరా పింఛన్‌లు

కామారెడ్డి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు రూ.6 వేలు, ఇతరులకు రూ.4 వేలు పింఛన్‌లు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పింఛన్ పెంచకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొత్త పింఛన్‌లకు మోక్షం లభిస్తుందోనని దరఖాస్తుదారులు, అర్హులకు నిరీక్షణ తప్పడం లేదు.

జిల్లాలో 1.65లక్షల పింఛన్‌లు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ప్రస్తుతం 1,65,781 మంది ఆసరా పింఛన్‌లను పొందుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చివరగా 2022లో కొత్త పింఛన్‌లు ఇచ్చారు. ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా కొత్త పింఛన్‌లను మంజూరు చేయలేదు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వృద్ధాప్య పింఛన్‌లకు అర్హత వయస్సును 65 నుంచి 57 సంవత్సరాలకు పెంచింది. దీంతో అనేకమంది దరఖాస్తులు చేసుకోగా కొంత మందికి మాత్రమే పింఛన్‌లు మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేయడం లేదని చాలా మంది అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా ప్రస్తుతం ఇచ్చిన పింఛన్‌లను రెట్టింపు చేస్తామని అర్హులైన కొత్తవారికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గత రెండేళ్ల కిందట నిర్వహించిన ప్రజాపాలన, గ్రామసభల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్త వారికి పింఛన్‌లు మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్‌లను పెంచకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటి వరకు పింఛన్‌లు పొందుతున్నవారు

క్ర.సం. పింఛన్ రకం	పింఛన్‌లు	రూ.లక్షల్లో
1. వృద్ధాప్య	50,187	1,011.77
2. వితంతు	52,059	1,049.59
3. వికలాంగులు	18,289	734.49
4. చేనేత కార్మికులు	580	11.69
5. కల్లుగీత కార్మికులు	784	15.81
6. బీడీ కార్మికులు	36,827	742.43
7. ఒంటరి మహిళలు	4,701	94.77
8. హెచ్‌ఐవీ బాధితులు	1,391	28.04
9. ఫైలేరియా వ్యాధిగ్రస్తులు	561	11.31
10. డయాలసిస్ వ్యాధిగ్రస్తులు	111	2.24
11. బీడీ టేకేదారులు	291	5.87
మొత్తం	1,65,781	3707.92

కొత్త పింఛన్‌ల మంజూరు ఎప్పుడో?

నాలుగేళ్ల నుంచి భర్తలు కోల్పోయిన మహిళలు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ కోసం (మిగతా 8లో..)



చెక్కులను అందిస్తున్న షబ్బీర్‌అలీ

ఇందిరమ్మ ఇళ్లను
అర్హులకు అందించాం

» ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను, రేషన్ కార్డులను అర్హులకు అందించామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని బాధితులకు రూ.30లక్షల వరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించామని తెలిపారు. అనారోగ్యంతో అప్పులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తుందని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా అమలు చేస్తున్నామని, రుణమాఫీ చేసి చూపించామని, రైతుభరోసా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు నష్టం కలిగించిన ధరణిని తొలగించి భూ భారతి తీసుకువచ్చి ప్రజల సమస్యలు శాశ్వతంగా తొలగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా
స్వెటర్ల అమ్మకాలు

- చలి తీవ్రతతో కొనుగోళ్లపై వినియోగదారుల ఆసక్తి
- ఇతర రాష్ట్రాల స్వెటర్లపై జిల్లా ప్రజల ఆసక్తి 8



సింగీతం రిటర్నింగ్ వాల్‌కు బుంగ



కొట్టుకుపోయిన రిటర్నింగ్ వాల్ వద్ద మట్టి పోసిన దృశ్యం

- కరిగిపోతున్న సింగీతం రిజర్వాయర్‌లో నీటి మట్టం
- ఏడాది కిందనే బుంగ
- శాశ్వాత మరమ్మతులు చేయని అధికార యంత్రాంగం
- 385 ఎకరాలకు సాగునీరు అందించే సింగీతం రిజర్వాయర్ దుస్థితి

నిజాంసాగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వందలాది ఎకరాలకు సాగునీరు అందించే సింగీతం రిజర్వాయర్ రిటర్నింగ్ వాల్‌కు బుంగ పడింది. ఏడాది కాలంగా నీరు వృథాగా పోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిజాంసాగర్ ఉమ్మడి మండలంలోని సింగీతం రిజర్వాయర్‌ను 0.2 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు 1996లో తెలుగుదేశం ప్రభుత్వంలో సింగీతం చెరువును రిజర్వాయర్‌గా మార్చారు. ఈ రిజర్వాయర్‌లో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిని నిల్వ చేస్తూ బూర్గుల్, మహమ్మద్‌నగర్, అన్నాసాగర్, నర్వ గ్రామాల రైతాంగానికి సాగునీరు అందించేందుకు నీరు ఉన్నప్పటికీ అధికారులు కేవలం 385 ఎకరాలకు నీరు అందించేందుకు పరిమితం చేశారు. ఈ రిజర్వాయర్‌కు కుడి, ఎడుమ కాలువలు కూడా ఉన్నాయి. కాలువలు అధ్వాన స్థితికి చేరి అక్కడక్కడ బుంగలు పడుతూ ఉండటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి.

రిటర్నింగ్ వాల్‌కు బుంగ

ఏడాది క్రితం సింగీతం (మిగతా 8లో..)



వృథాగా పోతున్న నీరు

కాలబైరవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రామారెడ్డి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలబైరవ స్వామి ఆలయంలో గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలబైరవస్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా దక్షయజ్ఞ కార్యక్రమాన్ని మహా వైవంగా నిర్వహించారు. ఈ మేరకు రథోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఇసన్నపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి రామారెడ్డి మండల కేంద్రంలో ఈ రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ రాజేష్‌చంద్ర నేతృత్వంలో ఎస్సై రాజశేఖర్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. రథోత్సవానికి మహిళలు హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సైతం రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభురాంచంద్రం, పంతులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ, జంగం ప్రభాకర్, స్వామి, కోటయ్య, గౌరయ్య, దిలీప్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

తాడ్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పర్యటించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, నూతన గృహప్రవేశాలు చేశారు. తాడ్వాయి బ్రాహ్మణపల్లి గ్రామాల్లో రూ.24 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన మెట్టు లావణ్య గృహ ప్రవేశానికి ఎమ్మెల్యేను ఆహ్వానించగా వచ్చి ఇందిరమ్మ ఇంటిలో కట్టుకున్న నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించారు. తాడ్వాయిలో అంగన్‌వాడీ భవన సెంటర్‌ను నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. నందివాడ, సోమారం గ్రామాల్లో కూడా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను (మిగతా 8లో..)

తరగతి మారేదెన్నడు..?

- శిథిలావస్థలో లక్కోర పాఠశాల
- భయం భయంగా చదువులు
- ఆగిన భవన నిర్మాణ పనులు
- 8 ఏళ్లుగా ఇదే పరిస్థితి



7

మాది మొదటి అంతస్తు.. మరి మీది?

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జీ+1కు అనుమతులు
- నిబంధనలు సడలించిన ప్రభుత్వం
- చిగురిస్తున్న ఆశలు



6



ఎల్లారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు
తరలించాలి

» కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

లింగంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకం వేగవంతం చేసి బస్తాలను లారీల్లో రైస్‌మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశించారు. లింగంపేట మండలంలోని ఎల్లారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హమాలీలు వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న తీరును పరిశీలించి వారితో మాట్లాడారు. హమాలీలు ఎక్కడి నుంచి వచ్చారని వారిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా తూకం పూర్తి చేసి బస్తాలను లోడ్ చేయాలని ఆయన సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు అవుతున్నాయా? పేమెంట్‌కు సంబంధించిన వివరాలను రైతులను, కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ రహిత పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ పథకంలో పేదలు నిర్మించుకుంటున్న (మిగతా 8లో..)

బీసీ రిజర్వేషన్‌లపై పోరాట దీక్ష

కామారెడ్డి టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీసీల పోరాట దీక్షను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్‌లు పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్ చేస్తున్నామన్నారు. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లో 10 శాతం పెంచిన కేంద్ర ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు, బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నారన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కేటాయించకపోతే రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. భారత రాజ్యాంగం ప్రకారం 15(4), 16(4) ప్రకారం రిజర్వేషన్‌లు మా హక్కు అని అన్నారు. ఎలాంటి పోరాటాలు చేయని అగ్రవర్ణాలకి రిజర్వేషన్‌లు కేటాయించి 9వ షెడ్యూల్‌లో చేర్చిన కేంద్ర ప్రభుత్వం అన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్న బీసీ సమాజంపై ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో చట్టం తెచ్చేలా ఒత్తిడి తేవాలని అన్నారు. త్వరలో ప్రారంభమయ్యే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి ఆమోదించాలని లేని పక్షంలో పార్లమెంట్ ముట్టడి చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్, పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



పోరాట దీక్షలో పాల్గొన్న బీసీ నాయకులు

ఇంటర్ ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

గాంధారి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మీషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటుగా పలు ఉన్నత పాఠశాలలో కళాశాలలో విద్యార్థులు చేరేందుకు పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు లక్ష్మణ్, శ్రీధర్, విజయ్‌కుమార్, రమేష్, సంబాజీ, సరిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం

» ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనలో నాణ్యత ప్రమాణాలు అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా సీసీటీఎన్‌ఎస్ వ్యవస్థలో కేసులకు సంబంధించిన అన్ని వివరాలు సమయానుసారంగా అప్‌డేట్ అవుతూ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైటర్లకు సూచించారు. సాక్షులు, ప్రత్యక్షసాక్షుల వాంగ్మూలాలు ప్రతీ కేసులో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. తప్పుడు లేదా నేరస్తులకు అనుకూలంగా ఇచ్చే స్టేట్‌మెంట్లు విచారణ నాణ్యతను దెబ్బతీస్తాయని తెలిపారు. ఎఫ్‌ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు అన్ని వివరాలు స్పష్టంగా, సమగ్రంగా, తప్పులు లేకుండా నమోదు చేయడం ప్రతీ రైటర్ బాధ్యతని తెలిపారు. బాధితుడికి సమయానికి న్యాయం జరిగేలా ప్రతీ చర్య ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాన్సువాడ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సోమేశ్వర్ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన ముజ్జు(27) బుధవారం రాత్రి పని ముగించుకుని బాన్సువాడ నుంచి దామరంచ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టగా.. ముజ్జు తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలిస్తుండగా మృతిచెందారు. మృతుడి భార్య తబస్సుం బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి.. కేసు నమోదు

నాగిరెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడి పాల్పడిన ఘటనలో గురువారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒకరు ఓ బాలికను 4 నెలల క్రితం మాయమాటలు చెప్పి.. పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు వివరించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడన్నారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురై వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు బాలికను చికిత్స కోసం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించరాన్నరు. బాలిక మూడు నెలల గర్భం దాల్చినట్టు వైద్యులు తెలిపారని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు

సుభాష్‌నగర్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 9 మందికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. నిందితుల్లో 21 మందిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదట హాజరుపర్చగా 13 మందికి రూ.10వేల చొప్పున జరిమానా, 9 మందికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు. మద్యం మోతాదును బట్టి ఒక్కొక్కరికి 5-7 రోజుల పాటు శిక్ష విధించినట్లు చెప్పారు.

వేల్పూర్: మండలంలోని లక్కోర క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలకు జరిమానా వేశామన్నారు. మద్యం తాగిన పట్టుబడిన వాహనదారులను ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించారన్నారు.

బోధన్: బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపించిన ఖాజాపూర్ గ్రామానికి చెందిన చింతం సాయిలును పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి కోర్టు న్యాయ అధికారి శేషతల్ప సాయి రూ.2 వేల జరిమానాతో పాటు 2 రోజుల జైలుశిక్ష విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

ఇందల్వాయి: డిచ్‌పల్లి వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రాముడుగు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్, ధర్మారం గ్రామానికి చెందిన మహ్మద్ బాబు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డట్లు ఎస్ఐ ఎండీ షరీఫ్ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం ఇద్దరికి 7 రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత

బోధన్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేస్తున్న బోలేరో వాహనంతో పాటు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పట్టుకున్న వాహనాలపై కేసు నమోదుచేసినట్లు ఆయన వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భారీగా ఆల్ప్రాజోలం స్వాధీనం

ఇందూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా ఆల్ప్రాజోలాన్ని పోలీసులు పట్టుకున్నారు. 150 గ్రాముల ఆల్ప్రాజోలం విలువ రూ.15లక్షల వరకు ఉంటుందని, నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సాదాబైనామా దరఖాస్తుల విచారణ


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖర్

మోస్రా, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మోస్రా మండలం మౌలాలిపూర్ గ్రామంలో తహసీల్దార్ రాజశేఖర్ గురువారం పర్యటించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం గ్రామానికి చెందిన 42 మంది రైతుల సాదాబైనామా పత్రాల విషయమై విచారణ చేపట్టారు. ఈ మేరకు కొనుగోలు చేసిన వ్యక్తి భూమి సాగులో ఉన్నారా లేదా అన్నది తెలుసుకున్నారు. అదే విధంగా అమ్మిన వ్యక్తులు వాస్తవంగా రికార్డులకు పట్టా కలిగి ఉన్నారా లేదా అనేదానిపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జీపీవోలు ఉదయ్, గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ రాజు, శ్రీనివాస్, భూభారతి ఆపరేటర్ నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధులకు 200 దుప్పట్ల పంపిణీ

రెంజల్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): చలికాలం తీవ్రత దృష్ట్యా రెంజల్ మండల కేంద్రానికి తిరుపతి హన్మాండ్లు(బుజ్జి) తన సొంత ఖర్చుతో గ్రామంలో సుమారు 200మంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. చలికాలం దృష్ట్యా చలి తీవ్రత అధికమవ్వడంతో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, హన్మాండ్లు, శంకర్, శేఖర్, ఎల్లప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

మాది మొదటి అంతస్తు మరి మీది..



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జీ+1కు అనుమతులు

▶▶ నిబంధనలు సడలించిన ప్రభుత్వం ▶▶ చిగురిస్తున్న ఆశలు

ఇందిరమ్మ ఇల్లు తప్పనిసరిగా 400-600 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించాలనే నిబంధనలు ఉన్నాయి. కొన్ని చోట్ల నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు కట్టడం లేదని అనుమతి రద్దు చేసింది. తక్కువ విసీర్ణం స్థలాలు ఉన్న లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సడలించింది. జీ+1 ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది. ఫలితంగా పట్టణంలో నిర్ణీత స్థలం తక్కువ ఉన్న లబ్దిదారులకు ఊరట కలగనుంది. నిర్ణీత విస్తీర్ణం లేని లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల జీ+ విధానంలో చేపట్టాలనుకుంటే ముందుగా గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ డీఈ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఇంటిని తప్పనిసరిగా ఆర్‌సీసీ ఫ్రేమ్‌లోనే నిర్మించాలి. ఇంటి నిర్మాణంలో తప్పనిసరిగా వంట గది, మరుగుదొడ్డి ఉండాలని నిబంధన విధించింది. గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ.లక్ష, రూఫ్ లెవెల్‌కు రూ.లక్ష, మొదటి అంతస్తుకు రూ.2లక్షలు, మొత్తం ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష బిల్లు చెల్లించనున్నారు.

గ్రామాల్లోనూ వెసులుబాటు

మున్సిపాలిటీలతో పాటు నిర్ణీత విస్తీర్ణం కన్న తక్కువ ఉన్న ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వెసులుబాటు ఉందని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లోనూ విస్తీర్ణం తక్కువ ఉందనే కారణంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలా చోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల వివరాలు అధికారులు సేకరిస్తున్నారు. పట్టణాల్లో మెప్మా, గ్రామీణ ప్రాంతాలలో సెర్ప్ సహకారంతో రుణ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బోధన్‌లో 516 ఇళ్లు మంజూరు కాగా.. 325ముగ్గు పోసి పనులు చేపట్టారు. 270 బేస్‌మెంట్, 127 స్లాబ్ వరకు పూర్తయ్యాయి. 131 మందికి ఇళ్లు మంజూరైనా కట్టుకోలేదు.

సొంతింటి నిర్మాణం పేదల చిరకాల వాంఛ. కానీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చాలా మంది కల సాకారమే కాదు. అలాంటి వారి కోసమే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది. ప్రభుత్వం పట్టణాల్లో మొదటి అంతస్తుకు అనుమతి ఇస్తూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు నిబంధనలను సడలించింది. మున్సిపాలిటీల్లో జీ+1 ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్న విషయం తెలుసుకున్న ప్రజలు సొంతింటి కల నెరవేరుతుందన్న గంపెడు ఆశతో ఉన్నారు. ఇప్పటికే పలువురు ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. - బోధన్

లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలి



బోధన్‌లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాలి. ఇసుకను ఉచితంగా అందజేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులుంటే కార్యాలయంలో సంప్రదించాలి.

- జాదవ్ కృష్ణ, మునిసిపల్ కమిషనర్, బోధన్

మెప్మా ద్వారా సహాయం

పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న వారిలో 71మందికి మెప్మా ద్వారా రూ.69.50లక్షలు ఇప్పించాం. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. ఇంకా చేపట్టని వారి పేర్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తీసేస్తాం. వారి స్థానంలో వేరే వారికి అవకాశం కల్పిస్తాం. **- జయంత్, హౌసింగ్ ఏఈ, బోధన్**

మహిళలకు ఉచిత శిక్షణ

ఇందల్వాయి, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 18 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని సంస్థ డైరెక్టర్ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్ 31 రోజుల శిక్షణ, బ్యూటీ పార్లర్‌కు 35 రోజుల ఉచిత శిక్షణ, భోజనం, హాస్టల్ వసతి సదుపాయం ఉంటుందన్నారు. 19-45 ఏళ్ల మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళలు ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి మెమో, బ్యాంక్ ఖాతా, 5 ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రం డిచ్‌పల్లిలోని ఘన్‌పూర్ రోడ్‌లో ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేర్లను నమో దు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08461295428లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం స్టేట్ కౌన్సిలర్‌గా రాకేష్‌చంద్ర


రాకేష్‌చంద్ర

వేల్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా స్థాయి జరిగిన ఎన్నికల్లో స్టేట్ కౌన్సిలర్‌గా అల్లకొండ రాకేష్ చంద్ర విజయం సాధించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను అన్ని విధాలా కృషి చేస్తానని రాకేష్‌చంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికైన రాకేష్ చంద్రకు జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పరిష్కార వేదిక

డొంకేశ్వర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని నూత్‌పల్లి ఏఈ రమేష్ అన్నారు. నూత్‌పల్లి సబ్ స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఎడపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బహుజన లెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, జూనియర్ అసిస్టెంట్ రవికి వినతి పత్రం అందజేశారు. జానకంపేటలో 12 ఏళ్ల నుంచి ప్రభుత్వ సర్వే నంబరు 188/1లో 50 కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని దండి వెంకట్ పేర్కొన్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. 1987లో ఉమ్మడి రాష్ట్రంలో మండలంలోని 30 మంది జోగినీ కుటుంబాలను గుర్తించి, జోగినీ వ్యవస్థను రూపు మాపాలనే ఉద్దేశ్యంతో వారికి అశానగర్ కాలనీలో సొంత ఇళ్లతో పాటు సాగు భూములను కేటాయించారన్నారు. ఇప్పుడు వారికి కేటాయించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పబ్బని లత, బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంజయ్, బోధన్ డివిజన్ కన్వీనర్ పోశెట్టి తదితరులున్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి


పోషకాహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ

ఆర్మూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు నర్సింగ్ కోర్సు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ సూచించారు. గురువారం ఆర్మూర్ మునిసిపల్ పరిధి పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళాప్రాంగణం)లో ఎం పీహెచ్‌డబ్ల్యు ఫీమెల్ (నర్సింగ్) రెండేళ్ల శిక్షణ కాలాన్ని పూర్తి చేసు కున్న అభ్యర్థినులకు న్యూట్రీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీఒక్కరు పోషకాహారం తయారు చేసుకొని వచ్చారు. ఆహారంలో ఎన్ని క్యాలరీలు, ప్రోటీన్స్, ఇతర అంశాలు ఉన్నాయో తెలిసేలా ప్రదర్శించారు. ఆహారంలో బ్యాలెన్స్ డైట్ ఉండేలా చూసుకోవాలని, సంప్రదాయ పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగి ఉండేలా చూసుకోవాలని రసూల్‌బీ పేర్కొన్నారు. ఆకుకూరలతో అధిక విటమిన్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారిణి ఇందిర, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

వేల్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషకాహారం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అధికారులను ఆదేశించారు. మండలం పచ్చలనడ్కుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదుల్లో విద్యార్థులకు కొనసాగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో వాడే వంట పాత్రలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజూ తాజా కూరగాయలతో భోజనం వండాలని నిర్వాహకులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు నిరంతరం ప్రత్యేక తరగుతులు నిర్వహిస్తూ.. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలి


బీడీ కార్మికులతో మాట్లాడుతున్న మల్లేష్

బోధన్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలని మల్టీ నేషనల్ కంపెనీల ప్రయోజనాలకు పని చేస్తున్న మోడీ విధానాలను వ్యతిరేకిద్దామని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ కోడ్‌లతో కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకోవాలన్నా, తమ హక్కులకు పోరాటాలు చేయాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు లక్ష్మి, హరిప్రియ, సవిత, కవిత, నబీనా, సునంద, గంగామణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను అరికట్టాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రెంజల్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలో వీధి కుక్కల బెడద అధికమవ్వడంతో గ్రామంలో చిన్న పిల్లలపై దాడులు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రెంజల్ మండల గ్రామస్థులు గురువారం పంచాయతీ కార్యదర్శి సాయిలుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గత వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన హనుమాన్ మందిర ఆవుపై వీధి కుక్కలు దాడి చేయడంతో ఆవు మృతి చెందడంతో పాటు గ్రామంలో ఉన్న చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు శాంతి పాదయాత్ర


శాంతి పాదయాత్ర ముగింపులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మరనాత ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో 4 రోజుల పాటు శాంతి పాదయాత్రలు చేపట్టడం సంతోషకరమైన విషయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలోని మరనాత ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రభువు పట్ల నిబద్ధతో ఉండి శాంతి మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పాస్టర్లు అమృత్ రాజ్, దాస్ ఎల్లం, రేవా, యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నందిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం ఎదుట గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కే.రాజు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్తున్న ఆటో బోల్తాపడి విద్యార్థులకు గాయాలైన ఘటనలో సమగ్ర శిక్ష ఉద్యోగులను బాధ్యులను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి.స్వామి, కంప్యూటర్ ఆపరేటర్ శివలింగం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ డి. రాములుయాదవ్ టర్మినెట్ చేయాలన్న ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యాసాగర్, సురేష్, హేమంత్, శ్రీనివాస్, నాగేష్ గౌడ్ తదితరులున్నారు.

ఇందూరుకు తరలిన కాంగ్రెస్ నేతలు

రుద్రూరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా నిజామాబాద్‌కు విచ్చేసిన సుదర్శన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలకడానికి బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రుద్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాయకులు కర్క అశోక్, షేక్ నిస్సార్, షేక్ గౌస్, పట్ల సురేష్, రవి ఉన్నారు.

బోధన్: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మహా సన్మాన సభకు గురువారం బోధన్ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల, గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బోధన్‌లో ఉదయం నుంచి భారీ వాహనాలను జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌కు తరలించారు. అక్కడి నుండి పట్టణంలోని వార్డులకు, గ్రామాలకు వాహనాలను పంపించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సుదర్శన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న బోధన్ కాంగ్రెస్ నాయకులు


రుద్రూర్ నుంచి తరలివెళ్తున్న దృశ్యం

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. ప్రభుత్వ సలహాదారులుగా బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఉదయం నుంచే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకొని పార్టీ నినాదాలు చేస్తూ వెళ్లారు.

రెంజల్: రెంజల్ మండల కాంగ్రెస్ నాయకులు సాటాపూర్ చౌరస్తా నుంచి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నిజామాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు జావీదోద్దీన్, నితిన్, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షులు కార్తీక్ యాదవ్, సీనియర్ నాయకులు లచ్చావర్ నితిన్, సిరాజ్ బేగ్, కలీం బేగ్, రవీంద్ర బాబు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అబ్బోళ్ల శ్రీకాంత్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి వాహనాలను తరలిస్తున్న పార్టీ నాయకులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


కందకుర్తిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కోటగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో విష్ణు సూచించారు. కోటగిరి మండలంలోని సుద్దులం, సుద్దులం తండా, ఎత్తొండ గ్రామాలలో గురువారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల త్వరితగతిన పూర్తిచేసుకుంటే బిల్లులు సకాలంలో అందుతాయని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రెంజల్: పేదోడి కల నెరవేరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకులు సిరాజ్ బేగ్, ఫుర్ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని కందకుర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇంటిని నిర్మించి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మాధవ రావు, అవేజ్, స్వప్న ఉన్నారు.

బోధన్: పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల ఇసుక పక్కదారి పట్టకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. గురువారం బోధన్ మున్సిపాలిటీ సమావేశపు మందిరంలో వార్డు అధికారులచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లలబక్కొక్కరికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తుందని, లబ్ధిదారులకు అందజేస్తున్న ఇసుక పూర్తి వివరాలను తమ వద్ద ఎప్పటికప్పుడు ఉంచుకోవాలని సూచించారు. పట్టణంలోని వార్డులలో ఇందిరమ్మ లబ్ధిదారులకు 8ట్రాక్టర్ల ఇసుక అందజేస్తుందని ఒక్కో లబ్ధిదారుడికి ఎన్నెన్ని ట్రాక్టర్లు అందాయో వివరాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ, ఉన్నతాధికారులు అడిగినప్పుడు పక్కా లెక్కలు చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రమేష్, బోధన్ హౌసింగ్ ఏఈ, వార్డు ఆఫీసర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తి వేయాలి

కోటగిరి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం కొడిచర్ల మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే అడ్డుకున్న వారిపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని పలువురు నాయకులు ప్రశ్నించారు. పోతంగల్‌లో గురువారం పలువురు నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇసుక అనుమతులు ఒక చోట పొంది మరోచోట తవ్వకాలు జరుపుతుంటే తాము అడ్డుకున్నామన్నారు. ఇసుక అక్రమాలపై తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సభను జయప్రదం చేయాలి

మాక్లూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నిర్మాత ప్రతిఘటన పోరాట రూపశిల్పి అమరుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న చంద్రపుల్లారెడ్డి రచనల పుస్తకావిష్కరణ సభను విజయ వంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు దేశెట్టి సాయిరెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 19న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సభను జయప్రదం చేయాలన్నారు. బోర్గం (కే) లో చంద్రపుల్లారెడ్డి పోస్టర్లు ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

ఆలూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం సైబర్ నేరాలపై ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, సూచించారు. అనుమానస్పద లింకులు, కాల్స్‌కి స్పందించరాదని సూచించారు. సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ఎట్టిపరిస్థితుల్లో వ్యక్తిగత ఏటీఎం వివరాలు, బ్యాంకుకు సంబంధించిన ఇతరాత్ర వివరాలను పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు గ్రామంలో వాహనాల తనిఖీలు చేసి అనుమానస్పద వ్యక్తులను వివరించారు.

తరగతి మారేదెన్నడు..?



నిర్మాణదశలో ఉన్న భవనం

- శిథిలావస్థలో లక్కోర పాఠశాల
- భయం భయంగా చదువులు
- ఆగిన భవన నిర్మాణ పనులు
- 8 ఏళ్లుగా ఇదే పరిస్థితి

వేల్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగా నికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితం శూన్యంగానే ఉంది. పాఠశాలలో తరగతి గదుల కొరత, శిథిలావస్థకు చేరిన భవనంలో విద్యార్థు లు చదువులు కొనసాగిస్తున్నారు. పాఠశాల సమస్యలు పరిష్కరించాల్సిన పాలకులు, ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు చెట్లకింద, శిథిలావస్థలో కూలడానికి సిద్ధంగా ఉన్న భవనంలో గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యను అభ్య సించే పరిస్థితి నెలకొంది. అందుకు వేల్పూర్ మండలం లక్కోర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసం పూర్తిగా ఉన్న తరగతి గదుల భవనమే ఉదాహరణ.

60 ఏళ్ల క్రితం నిర్మాణం..

సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భ వనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న అప్పటి ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ 2013 సంవత్సరంలో నిధులు మంజూరు చేయించి పాఠశాలకు 6 గదులతో కూడిన నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. కాగా 2014 లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తో భవన నిర్మాణపనులు నిలిచిపోయాయి. కొన్ని నెలల తర్వాత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హయాంలో తిరిగి నిధులు మంజూరవగా నిర్మాణ పనులు చేపట్టారు. స్లాబ్ వేయడం వరకు పనులు చేపట్టి ఆ తర్వాత నిలిపివేశారు. కాగా 8 ఏళ్ల నుంచి పాఠశాల భవనం అలాగే అసంపూర్తిగా ఉండిపోయింది. చేపట్టిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిపివేసినట్లు తెలుస్తుంది. 8 ఏళ్లుగా భవనం పనులు పూర్తి కాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో చదివిపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. దీంతో వారి పిల్లలను దూర ప్రాంతంలోని పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటికైనా నిలిచిన పనులను పూర్తి చే సి విద్యార్థులకు విద్యాబోధన కొనసాగించేలా చూడాల ని గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన పాఠశాల ఇదే..

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల భవనం పనులు ఆగిపోయిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పనులు పూర్తిచేసేందుకు రూ.40 లక్షలు మంజూరు చేయాలని కోరాం. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం.

- ఆత్మ రాము, కాంగ్రెస్ నాయకుడు, లక్కోర

పోచారం శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నసురుల్లాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మిర్జాపూర్ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గురువారం నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దుర్కి- బీర్కూర్ రోడ్డు నిర్మాణ పనులకు సీఎం సహకారంతో రూ.24 కోట్ల 72 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ నిధులపై కొందరు దుర్కి గ్రామంలో వేసిన శిలాఫలకానికి పిండ ప్రదానం చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.15కోట్ల రోడ్డు పనులకు అడ్డంకిని సృష్టించి పనులు ఆపేసిన నాయకునికి పిండ ప్రదానం చేయాల్సిందని ఎద్దేవా చేశారు. రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పురం వెంకట్, శ్రీనివాస్, మారుతి పటేల్, సాయిలు, నాగభూషణం, లక్ష్మణ్ ఉన్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

బాన్సువాడటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన మనోహర్‌రావు ఇంటి వద్ద శుక్రవారం కార్తీక వనభోజనాలు ఏర్పాటుచేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు బాన్సువాడ అయ్యప్ప ఆలయం వద్ద బస్సు ఏర్పాటుచేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గాయాల రహదారి



సిరికొండ- చిన్నవాల్గోట్ రోడ్డుపై ధ్వంసమైన కల్వర్టు

సిరికొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిరికొండ- చిన్నవాల్గోట్ మధ్య రహదారి అధ్వానంగా మారింది. 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తారురోడ్డుగా మార్చినా కేజీవీల్స్ పుణ్యమా అని రోడ్డంతా పాడైంది. దీనికితోడు వర్షాలకు కల్వర్టులు ధ్వంసమవగా వాహనదారులకు ప్రయాణ ఇక్కట్లు తప్పట్లేదు. దెబ్బతిన్న రోడ్ల జాబితాలో ఈ రోడ్డును అధికారులు చేర్చినం దున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధులు ఉన్నప్పటికీ పనులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొండూర్ వద్ద వంతెన తెగిపోయి నందున సిరికొండ పరిసర గ్రామాలు, మోడల్ స్కూల్లో చదివే పోత్నూర్, పెద్ద వాల్గోట్, చిన్నవాల్గోట్ గ్రామాల విద్యార్థులు ఈ రోడ్డునే ప్రయాణం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపించి త్వరగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేసినందున త్వరలో పనులు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ డీఈ అహ్మద్ హుస్సేన్ తెలిపారు.

శౌ'ఛీ'లయాలు



బాన్సువాడ బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

బాన్సువాడటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాలలో ప్రజల సౌలభ్యం కోసం, స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాలను సాధించేందుకు రూ.లక్షల నిధులతో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శౌచాలయాల నిర్వహణ కొద్దిరోజులుగా అధ్వానంగా మారింది. వెరసి అవి నేడు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ఆ పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. స్వచ్ఛసర్వేక్షన్‌లో భాగంగా 2023లో మూత్రశాలల నిర్మాణం చేపట్టారు. అయితే వాటి నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా మారాయి. చాలామంది ప్రయాణికులు, ప్రజలు మూత్రశాలలు మూసి ఉండటంతో ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో అక్కడి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మూత్ర శాలల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, డోర్లకు వేసిన తాళాలు తొలగించాలని కోరుతున్నారు.

పేకాటతో అప్పేనట



పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్న తాడ్వాయి ఎస్సై నరేష్ (ఫైల్)

తాడ్వాయి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పలువురు వ్యక్తులు దర్జాగా పేకాట ఆడుతున్నారు. గ్రామ శివారు ప్రాంతాలే అడ్డాలుగా మారుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో పేకాట వల్ల పలు కుటుంబాలు రోడ్డున పడి అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి. యువత సైతం పెడద్రోవ పడుతున్నారు.

ప్రతి గ్రామానికి ఒక పోలీసు అధికారి..

ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఓ పోలీసు అధికారిని నియమించింది. అయినప్పటికీ ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడ టం లేదు. ఏ ఒక్క గ్రామంలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు గ్రామాల్లో నిత్యం పర్యవేక్షించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేకాట ఆడితే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్సై నరేష్ తెలిపారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని, పేకాట ఆడుతూ పట్టుబడితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో మేకల సంత షురూ



మోర్తాడ్ మండలకేంద్రంలో మేకల సంతలో కొనుగోళ్ల దృశ్యం

మోర్తాడ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం మేకల సంత ప్రారంభమైంది. ప్రతి గురువారం మేకలు, గొర్రెల సంత జరుగుతుందని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా నెల రోజుల క్రితం ప్రారంభమైన మేకల సంతను స్థానికులైన కటికె వర్గానికి చెందిన వారు అడ్డుకోవడంతో సంత నిలిచిపోయింది. దీంతో గ్రామ కమిటీ సభ్యులు స్పందించి కటికె వారితో మాట్లాడారు. అయినా ఫలితం లేకపోవడంతో గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు కటికెవారి వద్ద మాంసం కొనుగోలు చేయవద్దని చాటింపు చేశారు. దీంతో గత మూడు వారాలుగా కటికెవారి వద్ద మాంసం కొనకపోవడంతో చివరకు వారు మేకల సంత పట్ల తమ అభిప్రాయాన్ని మార్చుకొని మేకల వ్యాపారులకు సంతకు రావాలని చెప్పడంతో నేడు సంత సజావుగా జరిగింది. సంతలో మేకల వ్యాపారులు మేకలు, గొర్రెలు తీసుకురావడంతో గ్రామస్థులే కాక పరిసర గ్రామాలకు చెందిన వారు కూడా కొనుగోళ్లు చేశారు. ప్రతీ గురువారం మేకల సంత జరుగుతుందని అవసరం ఉన్నవారు సంతలో పాల్గొని మేకలను కొనుగోలు చేసుకోవాలని పరిసరా గ్రామాలకు చెందిన వారికి తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో పాల్గొన్న నలంద పాఠశాల యాజమాన్యం

పెర్కిట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని నలంద పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి యాజమాన్యం ప్రసాద్, సాగర్‌లు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థిని విద్యార్థులు నైతిక విలువలతో పాటు ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవడం గురించి యాజమాన్యం వివరించారు. విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృం దం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ప్రచారజాతను జయప్రదం చేయాలి

నవీపేట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు వివిధ జిల్లాలలో బస్సు ప్రచార జాతను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య అన్నారు. గురువారం నవీపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న నిర్మల్ జిల్లా బాసరలో ప్రారంభమైన బస్సు ప్రచార జాత నవీపేట మండలం మీదుగా నిజామాబాద్ చేరుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలిఉల్లా ఖాద్రీ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి కామ్రేడ్ డీజీ నరేంద్ర ప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు కమ్యూనిస్టు పార్టీకి చెందిన జాతీయ, అంతర్జాతీయ నాయకులు హజరు కానున్నారని వివరించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

బిచ్కుంద, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సోయా రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలిగించవద్దని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం నాఫెడ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర అధికారి రవిచంద్ర, దువ్వా వినయ్‌లతో కలిసి ఎమ్మెల్యే సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సోయా తూకం వేసేటప్పుడు సోయాతో పాటు చిన్నసైజు మట్టి రావడంతో అధికారులు రిజెక్ట్ చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై కేంద్ర రాష్ట్ర అధికారులకు నివేదిక అందించి కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను కూడా ప్రత్యేక దృష్టిసారించి కొనుగోలు విషయంలో రైతులకు అవస్థలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌సీఎఫ్ఎల్ సర్వేయర్ మహేష్, మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ చందు, సంఘ అధ్యక్షుడు నాల్బర్ బాలాజీ, కాంగ్రెస్ డెలిగేట్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దర్పల్ గంగాధర్, సంఘ కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

బాన్సువాడటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం దీక్ష తీసుకున్న స్వాములకు సన్నిధానం ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటుచేశారు. అంతకుముందు అయ్యప్పస్వామికి దీక్షా స్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దకొడప్‌గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపిక అయినట్లు పీడీ ధర్మేందర్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలలో వడ్లం పాఠశాలకు చెందిన విద్యార్థులు బామన్ బావుసింగ్ అండర్- 14 బాలుర విభాగం హైజంప్‌లో ద్వితీయస్థానం, పెంట వెన్నెల అండర్- 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

ఉత్సాహంగా అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు

మెండోర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరుగుతున్న అంతర్ పాఠశాలల క్రీడలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 2వ రోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. గెలుపొందిన జట్లు సెమీ ఫైనల్ లో తలపడ్డారు. సబ్ జూనియర్ బాలికల కబడ్డీ ఫైనల్ పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానంలో, లిటిల్ ఫ్లవర్ పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో, పోచంపాడ్ బాలికల గురుకుల జట్టు తృతీయ స్థానంలో నిలిచారు. సబ్ జూనియర్ బాలికల ఖోఖో ఫైనల్ మ్యాచ్‌లో పోచంపా డ్ రెసిడెన్సియల్ బాలికల జట్టు ప్రథమ స్థానంలో, పోచంపాడ్ సాంఘిక సం క్షేమ బాలికల పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో, దూదిగాం సీఎస్‌ఐ పాఠ శాల తృతీయ స్థానంలో ని లిచింది. సబ్ జూనియర్ బాలుర వాలీబాల్ విభాగంలో సీఎస్ఐ ప్రథమ స్థానంలో, పోచంపాడ్ రెసిడెన్షియల్ బాలుర జట్టు ద్వితీయ స్థానంలో, పోచంపాడ్ జడ్పీ ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచారు. బాలికల జూనియర్ కబడ్డీల పోచంపాడ్ గురుకులు, మెండోరా జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు తలపడనున్నాయి. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యద ర్శి మల్లేష్, కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, రాజేందర్, ప్రేమ్ కుమార్, నరేందర్, రమణ, రాజేశ్వర్, నాగేష్, హరీష్, నాగేష్, నిఖిత, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లకు చెందిన విద్యార్థినులు భవ్య, ఎం.సాన్విక ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి గురువారం తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరిలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమ చారి, అమ్మఆదర్శపాఠశాల కమిటీ, వీడీసీ సభ్యులు, అభినందించారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన కలిగోట్ విద్యార్థినులు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థిని అల్జాపూర్ శ్రీ దుర్గ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏవీఎస్ శ్యామ్, ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన పోటీల్లో అండర్ -14 విభాగంలో 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి స్విమింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి వరంగల్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.



మెండోరలో జరిగిన కబడ్డీ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు



కబడ్డీ క్రీడల్లో బాలికలు..

రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

కామారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యాన్ని రైస్‌మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్ తదిరులు పాల్గొన్నారు.

శభాష్.. శశాంక్



పరీక్ష ఫీజును చెల్లిస్తున్న కోనేరు ట్రస్ట్ నిర్వాహకులు

కోటగిరి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును గురువారం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోనేరు శశాంక్ చెల్లించారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 197 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు సుమారు రూ.30 వేలను ఎంఈవో శ్రీనివాస్ రావుకు అందజేశారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కోనేరు శశాంక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, హరికృష్ణ, మోహన్ రావు, శ్రీనివాస్, శ్యామ్, విలాస్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించిన ఎంపీడీవో

రాజంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులు పరిశీలించినట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రేరణ కల్పించారు. ఇందిరమ్మ ఇండ్లు, పారిశుధ్యం, నర్సరీలు, డెమో అథెంటికేషన్, బీఎస్ఆర్ పన్నుల వసూళ్ల కార్మికుల సమీకరణపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అమృత్‌జల్ 2.0 పనులు



నిలిచిన అమృత్‌జల్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డు బీసీ కాలనీలో కొంతకాలంగా నిలిచిపోయిన అమృత్‌జల్ 2.0 పనులు గురువారం నుంచి వేగంగా కొనసాగుతున్నాయి. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అమృత్‌జల్ 2.0 ఏఈ నిర్వయ్‌ని కాలనీ వాసులు కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించేందుకు సహకరించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు ప్రత్యేకడ్రైవ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం

గాంధారి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందని ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటుగా పలు ఉన్నత పాఠశాలలో కళాశాలలో విద్యార్థులు చేరేందుకు పదవతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటిసంవత్సరం అడ్మిషన్లు ప్రభుత్వకళాశాలకే రావాలన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు లక్ష్మణ్, శ్రీధర్, విజయ్‌కుమార్, రమేష్, సంబాజీ, సరిత, సుజాత పాల్గొన్నారు.

పీఆర్వోను అభినందించిన డీజీపీ



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పీఆర్వో

కామారెడ్డిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పోలీసు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాములును డీజీపీ శివధర్‌రెడ్డి అభినందించి ప్రశంసాపత్రం అందించారు. హైదరాబాద్‌లోని పేట్లబుర్జ్ సిటీ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో మూడురోజుల పాటు జరిగిన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శిక్షణశిబిరంలో ఉత్తమప్రతిభ కనబరించినందుకు ప్రశంసినట్లు తెలిపారు.

భిక్కనూరులో ఒకేషనల్ విద్యార్థుల అన్‌జాబ్ శిక్షణ

భిక్కనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందారు. ఆన్‌జాబ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా భిక్కనూరు మండల కేంద్రంలోని మోటారు వైడింగ్ దుకాణాల్లో పలు అంశాలపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా లెక్చరర్ జంగం బాలప్రకాష్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఎలక్ట్రికల్ అకౌంటెంట్ టాక్సేషన్ ఆఫీస్ అసిస్టెంట్‌షిప్ కోర్సులు చదువుతున్న మొదటి, ద్వితయ సంవత్సరం విద్యార్థులకు అన్‌జాబ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతిసంవత్సరం రెండునెలల పాటుగా మోటార్ వైండింగ్ దుకాణాల్లో అవగాహన కల్పించడంతో పాటుగా దుకాణాల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీనివాస్‌చారి, నర్సింలుగౌడ్, శ్రీనివాస్, అశోక్ గౌడ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మంత్రి పొన్నం



వేడుకల్లో పాల్గొన్నమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారులు

కామారెడ్డిటౌన్,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వెల్మ ఫంక్షన్‌హాల్‌లో పీవీ రాజగోపాల్‌గౌడ్ కుమార్తె వివాహానికి మంత్రిపొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డిలతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెద్దఎత్తున కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు మంత్రిని, టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

కంటి వైద్యపరీక్షలు



ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో యూబీస్మార్ట్‌లెన్స్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటిపరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స అవసరమైన వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వెటర్ల అమ్మకాల జోరు



జిల్లా కేంద్రంలో స్వెటర్లు అమ్ముతున్న దృశ్యం

▸ చలి తీవ్రతతో కొనుగోళ్లపై వినియోగదారుల ఆసక్తి

కామారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజు రోజుకు చలితీవ్రత పెరుగుతుండడంతో స్వెటర్‌ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతిసారి లాగే ఈసారీ స్వెటర్ల దుకాణాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. అన్ని తరగతుల వారికి అందుబాటు ధరలలో లభిస్తుండడంతో కామారెడ్డి జిల్లా ప్రాంతానికి కస్టమర్లు వస్తుంటారు. స్థానిక వ్యాపారులతో పాటు నేపాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి వ్యాపారులు వచ్చి రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కో స్వెటర్ రూ.250ల నుంచి రూ.800లు వరకు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో చలితీవ్రత పెరగడంతో రోజురోజుకు గిరాకీ సైతం పెరిగింది. పిల్లలు యువతకు, పెద్దలకు వివిధ రకాల మోడల్స్ స్వెటర్స్ కోట్స్ అందుబాటులో ఉన్నాయి. సంక్రాంతి వరకు అమ్మకాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలుపుతున్నారు.

స్వెటర్‌లలో రకాలు : లాంగ్,షార్ట్, స్వెటర్లు ఊడి స్వెటర్లు, టూ ఇన్ వన్ జాకెట్‌షాట్స్, ఫొటోషాప్స్ ఫైజర్‌షాట్స్ పలు రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. బయట మార్కెట్‌లో ధరలు అధికంగా ఉండడంతో ఈ ప్రాంతంలో తక్కువ ధరలకే లభిస్థాయి.



స్వెటర్లు అమ్ముతున్న దృశ్యం

వ్యాపారులకు ఆన్‌లైన్ ఆర్డర్

గతంలో వ్యాపారులు వేరే ప్రాంతాలకు వెళ్ళి పెద్దఎత్తున స్వెటర్లు కొనుక్కొచ్చి అమ్మేవారు. కానీ ఆన్‌లైన్ సదుపాయాలు కావడంతో డబ్బులు ఆన్‌లైన్‌లో పంపించి కావాల్సిన స్వెటర్లను సైతం తెప్పించుకుంటున్నారు. దీంతో సమయంతో పాటు ఖర్చు కూడా కలిసొస్తుందని వ్యాపారులు అంటున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ఏఎంసీ ఆవరణలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

భిక్కనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు గురువారం అదనపు కలెక్టర్ విక్టర్ జిల్లా మార్కెటింగ్ అధికారిణీ రమ్య స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ ఆవరణలో రూ.90లక్షలతో నిర్మించనున్న కాంప్లెక్స్ నిర్మాణాలకు స్థల పరిశీలన చేశామని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెవెన్యూ సదస్సులు, సాదాబైనామా అప్లికేషన్లు, తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ గంగల భూమయ్య, తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్య, విండో డైరెక్టర్ ముచ్చర్ల రాజిరెడ్డి, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసులు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై మహేష్

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని మున్సిఫ్‌కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని గురువారం ఎస్సై మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని, శాంతి, సామరస్యం, న్యాయమే లోక్‌అదాలత్ లక్ష్యమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ లోక్ అదాలత్‌లో కుటుంబతగాదాలు, చెక్‌బౌన్స్, సివిల్ కేసులు, తదితర కేసులు సత్వరమే పరిష్కారం చేసి ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పామన్నారు. కక్షిదారులు ఈ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్త పింఛన్‌లు ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నారు. దివ్యాంగులు సైతం ప్రభుత్వం నుంచి పింఛన్ అందుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం వృద్ధాప్య పింఛన్‌లకు సంబంధించి భర్తకు పింఛన్ ఉండి ఆయన మరణిస్తే ఆ వెంటనే ఆయన భార్యకు, భార్యకు పింఛన్ ఉండి ఆమె మరణిస్తే భర్తకు పింఛన్ మంజూరు చేస్తున్నారు. కానీ కొత్తగా ఎవరు దరఖాస్తు చేసుకున్నా పింఛన్‌లు మంజూరు చేయకపోవడంతో అనేక కుటుంబాలు పింఛన్‌లు ఎప్పుడు మంజూరు చేస్తారో అని ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం సర్వేలు కూడా చేయించింది. అర్హుల జాబితాపై అభ్యంతరాలు సైతం స్వీకరించారు. ఈ నేపథ్యంలో కొత్త పింఛన్‌లు ఎప్పుడు మంజూరు చేస్తారు, ఉన్న పింఛన్‌లు ఎప్పుడు పెంచుతారని పలువురు అర్హులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలులోకి తీసుకురావాలని అర్హులైన వారితో పాటు పింఛన్‌లు పొందుతున్న లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

సింగీతం రిటర్నింగ్ వాల్‌కు బుంగ

(5వ పేజీ తరువాయి)

రిజర్వాయర్ రిటర్నింగ్ వాల్‌కు బుంగ పడటంతో రిజర్వాయర్‌లో క్రమేపీ నీటి నిల్వలు తరిగి పోతున్నాయి. గత ఏడాది రిటర్నింగ్ వాల్ బుంగ వద్ద నీటి పారుదల శాఖ అధికారులు ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఏడాది కురిసిన భారీవర్షాలకు రిటర్నింగ్ వాల్ వద్ద పడ్డ బుంగ మరింత కొట్టుకుపోయింది. పాలకులు, అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి నీటి నిల్వలు పొదుపు చేయాలని కనీస ఆలోచన లేకపోవడం పట్ల రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపి ఏడాది అవుతున్నా ఫలితం శూన్యం

ఈ రిటర్నింగ్ వాల్‌కు మరమ్మతులు చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు రూ.1.80 కోట్లు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి ఏడాది కాలం అయినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేక పోతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ రిజర్వాయర్ నుంచి దాదాపు 3.5 టీఎంసీల నీరు మంజీరా నదిలోకి ప్రవహించింది. సింగీతం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తరిగిపోతున్నా ఈ ఏడాది యాసంగికి సాగు నీటి కొరత ఉంటుందని రైతులు వాపోతున్నారు. పాలకులు నిధులు మంజూరు చేయించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వందలాది ఎకరాలకు సాగు నీరు అందించే సింగీతం రిజర్వాయర్‌పై పాలకుల నిర్లక్ష్య వైఖరి విడనాడి నిధులు మంజూరు చేయించాలని, బుంగకు మరమ్మతులు చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో రేపు సీపీఐ ప్రచార జాత

నిజామాబాద్ సిటీ, నవంబర్ 13: సీపీఐ ప్రజా సమస్యలపై 1925 నుంచి రాజీలేని ప్రజా పోరాటాలు చేస్తోందని జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పార్టీ శతజయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా సీపీఐ రాష్ట్ర బస్సు జాత నవంబరు 15న బాసర నుంచి ప్రారంభమై అర్సపల్లి చేరుకుంటుందని తెలిపారు. ఈ సభలో అతిథులుగా మాజీ ఎంపీ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఇతర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఓమయ్య, రఘురామ్, హన్మాండ్లు, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పి.సుధాకర్



సిరిపూర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలి

మోపాల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న బాసర నుంచి నిజామాబాద్ మీదుగా జరిగే బస్సు ప్రచార జాతలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. గురువారం సిరిపూర్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. నగరంలోని గాంధీగంజ్ కూరగాయల మార్కెట్ వద్ద జరిగే బహిరంగ సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని జిల్లా నాయకుడు సాయాగౌడ్ కోరారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశించి ఎమ్మెల్యే మదన్‌మోహన్ గారు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో బ్రాహ్మణపల్లి గ్రామానికి ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా మంజూరు కాలేదని అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం ఈ గ్రామానికే 31 ఇళ్లను ఆమోదించగా, అందులో 21 ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లు కూడా వెంటవెంటనే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమవుతున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వంతో మాట్లాడి నియోజకవర్గానికి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు తీసుకొని రావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతీ పేద కుటుంబం సొంత ఇల్లు కలిగి ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అంగన్‌వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు, సీసీ రోడ్లు, హెల్త్ సబ్‌సెంటర్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రతీ గ్రామంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జక్కుల రాజిరెడ్డి నాయకులు శ్యామ్‌రావు, వెంకట్‌రెడ్డి, గైని శివాజీ, ప్రతాప్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నర్సారెడ్డి, మోహన్ రెడ్డి, రాజేందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి నిజాయతీతిని నిరూపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని విగ్రహాల పార్కు వద్ద రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. బీసీలకు రాజకీయ విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు వెంటనే కల్పించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కొందరు అగ్రవర్ణాల దురహకార కేసులు వేసి రిజర్వేషన్‌లు ఆపేయడం అన్యాయమన్నారు. వెంటనే కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుస్సా ఆంజనేయులు, ప్రసాద్, దేవేందర్, కరిపె రవీందర్, మాడవీడి వినోద్‌కుమార్, శంకర్, శ్రీలత, చంద్రమోహన్, అజయ్, చంద్రకాంత్, శ్రీనివాస్, దయానంద్, గోపాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు నిర్ధేశిత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా పరిశీలించాలని ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇటుక, ఇసుక వంటి సామగి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. లబ్ధిదారులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటుంటే వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు రావాలని కలెక్టర్‌ను లబ్ధిదారులు అహ్వానించగా సామూహిక గృహ ప్రవేశాలకు వస్తానని లబ్ధిదారులకు మాట ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురెందర్, ఎంపీడీవో నరేష్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు ఉన్నారు.

అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలను పూర్తిచేయాలి

కామారెడ్డిటౌన్ : అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలను తక్షణమే పూర్తిచేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, ఆరోగ్యపరీక్షలు, సామ్‌మామ్ లేని అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితులపై అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇంకా పూర్తికాని తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వసతులు వంటి మౌలిక సదుపాయాలపై లైన్‌డిపార్ట్‌మెంట్ అధికారులను ప్రశ్నించి వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. మూడునెలలుగా జిల్లాలో సీడీపీఓలు, సూపర్‌వైజర్‌ల తనిఖీ ల సంఖ్య తక్కువగా ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వృద్ధాశ్రమం ప్రారంభోత్సవ సంబంధిత ఏర్పాట్లను, దానికి వెళ్లే దారి పనులను త్వరగా పూర్తిచేయాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. పోషణ ట్రాకర్‌లోని ఎఫ్ఆర్ఎస్, అపార్ వంటి అంశాలపై సమీక్ష జరిపి సమర్థవంతంగా అమలు జరిగేలా చూడాలని తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ నమోదుకోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని ఈడీఎంను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ప్రమీల, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆక్రోశ సభను జయప్రదం చేయండి

ధర్పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీల కు 42 శాతం రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వ ర్యంలో కామారెడ్డిలో శనివారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ధర్పల్లి మండల బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి.. నేటికీ నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు ఉన్న ఉత్సాహం ముఖ్యమ ంత్రి అయ్యాక లేదని మండిపడ్డారు. అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్‌కు, పార్లమెంటుకు బిల్లును పంపి చేతులు దులుపుకొన్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశంలో కాంగ్రె స్ ఎంపీలతో పార్లమెంట్‌లో బిల్లుపై చర్చకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు 42 శాతం బీసీలకు మద్దతు తెలియజేస్తున్నామని చెబుతూనే గవర్నర్ వద్ద బిల్లును పెం డింగ్ పెట్టడం శోచనీయమన్నారు.



మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

సోలార్ కంచె పనులు ప్రారంభం

భిక్కనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం చుట్టూ ఏర్పాటు చేస్తున్న సోలార్‌ఫెన్సింగ్ పనులను గురువారం ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, ఈవో శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో కోతులబెడద ఎక్కువగా ఉన్నందున భక్తులకోరిక మేరకు దాతల సహాయంతో ఆలయం చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు సాగుతున్నామన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి జటాధర
వెంకటేశ్వర మాస్ జాతర

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230